మెంటర్ ఆఫ్ ది ఇయర్‌గా ప్రొఫెసర్ డా. లక్ష్మి

సిటీబ్యూరో, సెప్టెంబర్ 21(నమస్తే తెలంగాణ): జాతీయ ప్లాస్టిక్ సర్జరీ విభాగానికి సంబంధించి కోయంబత్తూర్‌లో జరిగిన ఆప్సికాన్-2024 జాతీయ సదస్సులో భాగంగా ఉస్మానియా దవాఖాన ప్లాస్టిక్ సర్జరీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పలుకూరి లక్ష్మికి అరుదైన మెంటర్ ఆఫ్ ది ఇయర్ టైటిల్ దక్కింది. కోయంబత్తూర్‌లో ఇటీవల జరిగిన ఆప్సికాన్ జాతీయ సదస్సు సందర్భంగా 4 నెలల ముందుగానే ఉస్మానియా ప్లాస్టిక్ సర్జరీ విభాగం నుంచి ప్రతి శని, ఆదివారాల్లో నాలుగు నెలల పాటు దేశ వ్యాప్తంగా 16 టీమ్‌లకు నిర్వహించిన ప్లాస్టిక్వెస్ట్ ఛాలెంజ్ కాంపిటీషన్‌లో మొత్తం 32 మంది పీజీ విద్యార్థులు పాల్గొనగా, అందులో నలుగురు ఎంపికయ్యారు. ప్రతి సెషన్‌కు 120 మందికి పైగా పీజీ వైద్య విద్యార్థులు హాజరయ్యారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 21: నారాయణగూడలోని బాబు జగ్జీవన్‌రామ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి అతిథి ఆధ్యాపక పోస్టులను భర్తీ చేసేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్, బాటనీ, ఫిజిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లలో పోస్టులు ఖాళీగా ఉన్నాయని, 55 శాతం మార్కులతో పీజీ డిగ్రీ కలిగి ఉండాలన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీహెచ్‌డీ, నెట్, స్లెట్ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 23న ఉదయం 10 గంటలకు కాలేజీ ఆవరణంలో జరిగే ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

నగరంలో శనివారం సాయంత్రం కుండపోతగా కురిసిన వర్షానికి పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షం కురిసింది కాసేపైనా నగరంలో ట్రాఫిక్‌ను గంటల కొద్దీ నిలిచేలా చేసింది. కాగా, పలువురు నగరవాసులు, ఉద్యోగులు ఆయా కార్యాలయాల నుంచి ఇండ్లకు చేరాల్సిన వేళ వర్షం జోరుగా కురుస్తుండటంతో గొడుగులు చేబూని బస్సులు, ఆటోల రాక కోసం ఎస్సార్ నగర్ బస్టాప్‌లో వేచి చూశారు.

పీఎస్ తెలుగు వర్సిటీకి సురవరం పేరు హర్షణీయం

ప్రతాపరెడ్డి కుమారుడు డాక్టర్ కృష్ణవర్ధన్

సమావేశంలో మాట్లాడుతున్న సురవరం కృష్ణవర్ధన్

రవీంద్రభారతి, సెప్టెంబర్ 21: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ వైతాళికుడు గోల్కొండ పత్రికా సంపాదకుడు సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టడం హర్షణీయమని సురవరం ప్రతాపరెడ్డి కుమారుడు డాక్టర్ కృష్ణవర్ధన్ హర్షం వ్యక్తం చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలుగు భాషా చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు పి.బడేసాబ్ అధ్యక్షతన శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి సురవరం కృష్ణవర్ధన్ విచ్చేసి మాట్లాడుతూ, సురవరం ప్రతాపరెడ్డి నిజాం నిరంకుశ రాజులకు వ్యతిరేకంగా గోల్కొండ పత్రికను స్థాపించి తన గళాన్ని విప్పి పోరాటం చేసిన గొప్ప యోధుడని అన్నారు. ఒకనాడు తెలంగాణలో కవులే లేరని చెప్పిన ఆంధ్ర పాలకులకు, ఆంధ్రకవులకు దీటుగా 300 మంది తెలంగాణ కవులతో కవి సమ్మేళనం నిర్వహించి ఆంధ్ర కవులను నివ్వెరపరిచిన గొప్ప సాహితీవేత్త సురవరం ప్రతాపరెడ్డి అని కృష్ణవర్ధన్ పేర్కొన్నారు. అలాంటి గొప్ప మేధావి, సాహితీవేత్త పేరిట తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాషా చైతన్య సమితి అధ్యక్షుడు పి. బడేసాబ్, డాక్టర్ చంద్రప్రకాశ్‌రెడ్డి, రవీందర్, రామకృష్ణ చంద్రమౌళి, గోల్కొండ సాహితీ కళా సమితి ఉపాధ్యక్షుడు గంటా మనోహర్ రెడ్డి, సంపంగి నరసింహులు, సాహితీవేత్త రఘుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సదస్సు సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో అఖిల భారత రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ (ఏబీఆర్ఎస్ఎం) తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో జాతీయ మహిళా అధ్యాపకుల సదస్సును శనివారం నిర్వహించారు. 'ఎన్విజనింగ్ న్యూ భారత్' అనే థీమ్ ఆధారంగా నిర్వహించిన ఈ సదస్సు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో పాటు ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ సుధామూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని, అప్పుడే మహిళలు సాధికారత సాధించగలరని అన్నారు. సదస్సుకు తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి దాదాపు 1200 మందికి పైగా మహిళా అధ్యాపకులు హాజరయ్యారు.

- ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 21;

అల్జీమర్స్‌కు జాగ్రత్తలు తీసుకుంటే మంచిది

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అతిథులు, వైద్యులు

ఎర్రగడ్డ, సెప్టెంబర్ 21: అధిక మద్యపానం, ధూమపానం వంటి చెడు వ్యసనాల వల్ల అల్జీమర్ వ్యాధి బారినపడే అవకాశాలు మెండుగా ఉంటాయని మానసిక వ్యాధుల నిపుణులు పేర్కొన్నారు. ప్రపంచ అల్జీమర్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎర్రగడ్డ మానసిక వ్యాధుల దవాఖానలో శనివారం అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఇందుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన మెంటల్ హెల్త్ అవేర్‌నెస్ కమిటీ చైర్మన్ డాక్టర్ జార్జ్‌రెడ్డితో పాటు గౌరవ అతిథిగా హైదరాబాద్ సైక్రియాటిక్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రిషికేశ్ గిరిప్రసాద్ విచ్చేశారు. సదస్సుకు హాజరైన వివిధ వైద్య కళాశాలల జూనియర్ డాక్టర్లు, నర్సింగ్ విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడారు. అల్జీమర్స్ (మతి మరుపు వ్యాధి)ని ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స, వైద్య సలహాలను పాటించాలని, లేని పక్షంలో డిమెన్షియా స్టేజీకి వెళ్లక తప్పదని వక్తలు వివరించారు. డిమెన్షియా స్టేజీకి వెళ్లిన వాళ్లను మామూలు మనుషులుగా మార్చటం ఎంతో క్లిష్టమైన పని అని పేర్కొన్నారు. అల్జీమర్స్ బారిన పడిన వాళ్లు వ్యాయామం చేస్తే ఎంతో మేలన్నారు. ఒత్తిడి, నిరాశకు గురి కావొద్దని, నాణ్యమైన నిద్రకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సూపరింటెండెంట్ డా.అనిత, మానసిక నిపుణులు డా.సుధ, డా.వివశ్వన్ పాల్గొన్నారు.

మెర్సిడెజ్ బెంజ్ షోరూమ్ ప్రారంభం

సిటీబ్యూరో, సెప్టెంబర్ 21(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహా నగరంలో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన షోరూమ్‌ను మెర్సిడెజ్ బెంజ్ సిల్వర్ స్టార్ కంపెనీ ప్రారంభించింది. మాడ్రన్ ఆర్కిటెక్చర్ ఆఫ్ రిటెయిల్ కాన్సెప్ట్‌తో రూపొందించిన ఆధునిక ప్రాంగణాన్ని మెర్సిడెజ్ బెంజ్ ఇండియా సీఈఓ, ఎం.డీ సంతోష్ అయ్యర్ ప్రారంభించారు. లగ్జరీ కార్ల మార్కెట్‌లో బెంజ్ కార్లకు ఎంతో పేరు ప్రఖ్యాతులు ఉన్నట్లుగానే దాని వినియోగదారులకు షోరూమ్‌లను అందుబాటులో ఉంచేందుకు సిల్వర్ స్టార్ దీనిని కొత్తగా అందుబాటులోకి తీసుకువచ్చిందని ఆయన తెలిపారు. దీనిని ఇండియాలోనే మొదటి బ్యాచ్ లాంజ్‌గా ఏర్పాటు చేశారని, ఈ బెంజ్ కార్ల షోరూమ్‌లో ఆధునికతకు తోడు కస్టమర్లకు సౌకర్యవంతమైన సేవలను అందించేలా ప్రాంగణాన్ని తీర్చిదిద్దారని తెలిపారు.

జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నతుడు లక్ష్మణ్ బాపూజీ

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య

వర్ధంతి వేడుకల్లో పాల్గొన్న ఆర్.కృష్ణయ్య, గుజ్జ సత్యం, కృష్ణ, తదితరులు

కాచిగూడ, సెప్టెంబర్ 21: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాన్నే త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అని, ఆయనకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారం ఇవ్వాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య కోరారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఉత్సవ కమిటీ చైర్మన్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ఆధ్వర్యంలో కాచిగూడ అభినందన్ హోటల్‌లో కొండా లక్ష్మణ్ 12వ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ, బీసీని ముఖ్యమంత్రి చేయడమే లక్ష్మణ్ బాపూజీకి ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. బీసీల ముద్దు బిడ్డ, పేద, మధ్యతరగతి ప్రజలందరికి ఆదర్శ ప్రాయంగా నిలిచి, తెలంగాణ ఉద్యమంలో వీరోచితంగా పోరాడిన గొప్ప వ్యక్తి కొనియాడారు. కొండా లక్ష్మణ్ జయంత్యుత్సవాలను తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం శుభసూచకమన్నారు. కార్యక్రమంలో జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నీల వెంకటేశ్, రామకృష్ణ, నందగోపాల్, అంజి, సతీశ్, మురళీకృష్ణ, సురేశ్, పండరీనాథ్, శ్రీకాంత్, సురేశ్, సూర్యనారాయణ, జానయ్య, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో ఎస్‌బీఐ బ్యాంకు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 21(నమస్తే తెలంగాణ): సామాజిక సేవలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎప్పుడూ ముందుంటుందని ఎస్‌బీఐ చైర్మన్ సి.ఎస్.శెట్టి అన్నారు. నగరంలోని ఎస్బీఐ బ్యాంకు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సామాజిక సేవా కార్యక్రమాల్లో శెట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. అనంతరం, నగరంలోని దేవనార్ ఫౌండేషన్‌కు మద్దతుగా రూ.51 లక్షలను అందజేశారు. ఈ నిధులతో దేవనార్ ఫౌండేషన్‌లో ఫైర్ ఫైటింగ్ సిస్టం, రూఫ్ టాప్ సోలార్ ఫొటో వొల్టాయిక్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. కార్పొరేట్ సంస్థల సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిరంతరం చేపడుతున్నామని, ఎస్‌బీఐ లేడీస్ క్లబ్ సభ్యులు సైతం మొక్కలు నాటే కార్యక్రమంలో పాలుపంచుకున్నారని తెలిపారు.

గోవధ నిషేధ చట్టం పకడ్బందీగా లేదు

- బోర్డు సభ్యులుగా కేంద్ర మంత్రి సిఫారసు చేసిన వారే..
- యుగ తులసీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శివ కుమార్



ఖైరతాబాద్, సెప్టెంబర్ 21: దేశంలో గోవధ నిషేధ చట్టం పకడ్బందీగా అమలు కావడం లేదని, అందుకే జంతువుల నూనెలు మార్కెట్‌లోకి వస్తున్నాయని యుగ తులసీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కె.శివ కుమార్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తిరుపతిలో లక్ష 20 వేల గోవుల తో గోదామం ఏర్పాటు చేయాలని, ఆ నెయ్యినే స్వామి వారికి నైవేద్యంగా సమర్పించాలని రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. శివ కుమార్ మాట్లాడుతూ, తిరుపతి లడ్డూలో జంతువుల నుంచి తీసిన కొవ్వును వాడారంటూ ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో దానిని రాజకీయం చేయాల్సిన అవసరం లేదని, ఇప్పటికే హిందువుల మనోభావాలు దెబ్బ తిన్నాయన్నారు. శ్రీనివాసుడి ప్రసాదంలో వినియోగించే ఆవు నెయ్యి కోసం టీటీడీ ఒక లక్ష 20వేల దేశీ గోవులతో తిరుపతిలో గో మహాదామం నిర్మాణాన్ని చేపట్టాలని యుగ తులసీదేనని స్పష్టం చేశారు.

గోవిందుడికి గోమాంస నైవేద్యం పెడతారా?

వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి శశిధర్

సమావేశంలో మాట్లాడుతున్న శశిధర్, చిత్రంలో తదితరులు

ఖైరతాబాద్, సెప్టెంబర్ 21: కోట్లాది మంది భక్తులు తమ ఇలవేల్పుగా భావించే గోవిందుడికి గోమాంస నైవేద్యం పెడతారా? అంటూ వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలోనే ఏడు కొండలను రెండు కొండలుగా మార్చే కుట్ర చేశారన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ హయాంలో తిరుమలపై అన్యమతాలకు చెందిన యూనివర్సిటీ, ఇతర మతాలకు చెందిన ఉద్యోగుల నియామకాలు జరిగాయని, దేవాలయం పవిత్రతను దెబ్బతీసే కార్యకలాపాలు చేశారని ఆరోపించారు. దేశ నేతలతో పాటు న్యాయమూర్తులు, ప్రముఖులు ఈ లడ్డూ ప్రసాదాన్నే తిన్నారని, ఎంతో పవిత్రంగా భావించే శ్రీవారి లడ్డూ స్వచ్ఛమైన నెయ్యితో తయారు చేయాల్సి ఉండగా, జంతువుల కొవ్వు, చేపల నూనెతో తయారు చేయడం ఘోరమైన అపచారమన్నారు. గత ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు నియమించిన బోర్డు సభ్యులు, బాధ్యులు ఈ పాపానికి ఒడిగట్టారని పేర్కొన్నారు. వేంకటేశ్వరస్వామి ప్రసాదంలో జంతువుల నూనె కలిసిందంటూ స్వయంగా ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించి 60 గంటలు దాటిన నేపథ్యంలో బాధ్యులపై ఎందుకు ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని ప్రశ్నించారు. సమావేశంలో విశ్వహిందూ పత్రిక ఎడిటర్ కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఏపీ రాష్ట్ర కార్యదర్శి తనికెళ్ల సత్య రవి కుమార్, డా. సునీతారా మ్మోహన్ రెడ్డి, డా. రామ్‌సింగ్, పగడాకుల బాలస్వామి పాల్గొన్నారు.

నమస్తే.. కథనానికి స్పందన

- 'తాగేనీటిలో మురుగు నీరు సరఫరా'కు దిగి వచ్చిన అధికార యంత్రాంగం

మరమ్మతుల అనంతరం, స్వచ్ఛమైన మంచినీటిని బాటిల్స్‌లో పట్టి చూపిస్తున్న జల మండలి అధికారులు, స్థానిక మహిళలు

మైలార్‌దేవపల్లి, సెప్టెంబర్ 21: మూడు నెలలుగా మంచినీటి నల్లాల్లో కలుషిత నీటి సరఫరాతో ప్రజలు అనేక రోగాల బారిన పడుతున్నారు. ఇదే విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధులకు, అధికారులకు, లైన్‌మెన్‌లకు తెలిపినా ఏ ఒక్కరు స్పందించలేదు. దీంతో విసుగెత్తిన మహిళలు శుక్రవారం రోడ్డెక్కి ఆందోళనకు దిగారు. ఈ మేరకు నమస్తే తెలంగాణ దినపత్రికలో శనివారం 'తాగేనీటిలో మురుగు నీరు సరఫరా' అనే శీర్షికను ప్రచురించింది. ఈ వార్తకు జలమండలి అధికారులు స్పందించి నీరు కలుషితంగా మారుతున్న ప్రాంతాన్ని గుర్తించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకున్నారు. శనివారం ఉదయం మైలార్‌దేవపల్లి డివిజన్ ఆప్కో కాలనీ ప్రాంతానికి జల మండలి జనరల్ మేనేజర్ సాయిలక్ష్మి, డీజీఎం రేణుక, మేనేజర్ సయ్యద్ సిద్ధిఖీలు చేరుకున్నారు. ఈ సందర్భంగా సిబ్బందితో కాలనీకి సరఫరా అవుతున్న పైప్‌లైన్‌ను పరిశీలించారు. వాల్స్ వద్ద లీకేజీలు, సరఫరాలో జరుగుతున్న అంతరాయాలు తదితర వాటిపై సమీక్షించారు. అనంతరం, కాలనీకి వస్తున్న నీటి పైపు వద్ద ఏర్పడిన లీకేజీని గుర్తించారు. వెంటనే సిబ్బంది చేత మరమ్మతులు చేయించారు. అనంతరం, వారు మాట్లాడుతూ గతంలో మంచినీటి పైపు లైన్ల పక్క నుంచే డ్రైనేజీ లైన్లు సైతం ఏర్పాటు చేశారన్నారు. దీని కారణంగా తరచు సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటిని అందించి వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తమ వంతు బాధ్యతగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మరోసారి కలుషిత నీరు సరఫరా కాకుండా ప్రత్యేక చొరవ తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నమస్తే తెలంగాణ దినపత్రికలో వచ్చిన కథనానికి జల మండలి అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించారని, ఇందుకు దిన పత్రికకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు స్థానికులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ జియావుద్దీన్, రాజేశ్ కుమార్, లైన్‌మెన్ జనార్దన్, స్థానిక మహిళలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

అభివాదం చేస్తున్న బీసీ సంఘాల పలువురు నేతలు

బీసీ మహిళలకు వాటా లేని బిల్లును అంగీకరించం

ఖైరతాబాద్, సెప్టెంబర్ 21: బీసీ మహిళలకు వాటా లేని మహిళా బిల్లును అంగీకరించమని వక్తలు స్పష్టం చేశారు. బీసీ సంక్షేమ సంఘం, బీసీ మహిళా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, వకుళాభరణం కృష్ణ మోహన్ రావు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ లు మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏండ్లలో చట్ట సభల్లో అగ్రవర్ణాలే రాజ్యమేలారన్నారు. దేశ జనాభాలో 60 శాతం ఉన్న బీసీలకు 18, 30 శాతం ఉన్న మహిళలకు రెండు శాతం మాత్రమే ప్రాతినిధ్యం దక్కిందన్నారు. అగ్ర వర్ణాలకు మాత్రం 90 శాతం దక్కిందని తెలిపారు. పార్లమెంట్‌లో ప్రాతినిధ్యంలో ఉన్న 26 రాజకీయ పార్టీలు మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కావాలని గట్టిగా నిలదీయలేకపోయాయన్నారు. త్వరలో వెయ్యి మంది మహిళా ప్రతినిధులతో బీసీ మహిళా రాజకీయ ప్లీనరీని నిర్వహిస్తామన్నారు. బీసీ మహిళా సంఘం అధ్యక్షురాలు మణిమంజరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంధ్యారాణి, తారకేశ్వరి, శ్యామలారాణి, లావణ్య, మీన, గణేశ్ చారి పాల్గొన్నారు.

లక్ష్మణ్ బాపూజీకి నివాళి

అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, యువ జన విభాగం జాతీయ ఇన్‌చార్జ్ అవ్వారి భాస్కర్ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో నిర్వహించి ఆయన చిత్ర పటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు.

- హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 21

రసూల్ ఖాన్‌కు పీహెచ్‌డీ ప్రదానం

కర్పగం అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (డీమ్డ్ టూ బీ యూనివర్సిటీ) 15వ స్నాతకోత్సవంలో భాగంగా షాదన్ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ డాక్టర్ మహ్మద్ షా ఆలం రసూల్ ఖాన్‌కు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) డిగ్రీని ప్రదానం చేశారు. కార్యక్రమంలో థైరోకేర్ క్రియేటర్ డాక్టర్ ఏ.వేలుమణి, యూనివర్సిటీ ప్రెసిడెంట్ ఆర్.వసంత కుమార్, చాన్సలర్ కె.రామస్వామి, సీఈఓ కె.మురుగయ్య తదితరులున్నారు.

- సిటీబ్యూరో, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ)

తెలంగాణ భవన్‌లో లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి

హైదరాబాద్, సెప్టెంబర్ 21(నమస్తే తెలంగాణ): స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ బిడ్డ కొండా లక్ష్మణ్ బాపూజీ ప్రత్యేక రాష్ట్ర సాధనకు, వెనకబడిన తరగతుల అభ్యున్నతికి చేసిన సేవలు ఎనలేనివని పలువురు రాజకీయ నాయకులు, బీసీ సంఘాలు నేతలు కొనియాడారు. రాష్ట్ర వ్యాప్తంగా శనివారం లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి ని నిర్వహించారు. తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు ఘనంగా నివాళులర్పించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసిన కేటీఆర్ ఆయన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో శాసన మండలిలో ప్రధాన ప్రతిపక్ష నేత ఎస్.మధుసూదనాచారి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు వి.శ్రీనివాస్ గౌడ్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నోముల భగత్, పి.శశిధర్‌రెడ్డి, జాజుల సురేందర్, బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్ కుమార్, సాంబారి సమ్మారావు, గజ్జెల నగేశ్, పల్లె రవి కుమార్, గౌరీ శంకర్, చిరుమల్ల రాకేశ్ కుమార్, కే వాసుదేవరెడ్డి, గెల్లు శ్రీనివాస్ యాదవ్, దూదిమెట్ల బాలరాజ్ యాదవ్, కడారి స్వామి యాదవ్ పాల్గొన్నారు.

లాభాల్లో మహేష్ బ్యాంక్



సిటీబ్యూరో, సెప్టెంబర్ 21(నమస్తే తెలంగాణ): ఏపీ మహేష్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లాభాల్లో దూసుకుపోతుంది. పలు రాష్ట్రాల్లో 45 బ్రాంచుల ద్వారా విస్తరించి, బ్యాంకింగ్ లావాదేవీలు అందిస్తున్న ఆర్థిక సంవత్సరంలో రూ. 69.51 కోట్లు లబ్ధి పొందినట్లుగా తేలింది. ట్యాక్స్‌లను మినహాయిస్తే రూ.49.56 కోట్లుగా ఉంటుందని ఓ ప్రకటనలో తెలిపారు. ఇక సొంత నిధులు కూడా రూ.398 కోట్ల నుంచి 444.20 కోట్లకు వరకు పెరిగినట్లుగా వెల్లడించారు. నిల్వ నిధుల్లోనూ వృద్ధిని సాధించామని, 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.3300 కోట్ల వ్యాపార లావాదేవీలు జరిపినట్లుగా ప్రకటించారు. బంజారాహిల్స్‌లోని మహేష్ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో హైకోర్టు ఆదేశాలతో నియమితులైన కార్యనిర్వహణ అధికారి రాంనారాయణ బోగ నేతృత్వంలో జరిగిన 48వ వార్షిక సమావేశంలో బ్యాంకింగ్ రంగంలో మహేష్ బ్యాంక్ మరో మైలు రాయిని చేరుకునేలా వ్యాపారాన్ని విస్తరిస్తుందని పేర్కొన్నారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు అమోఘం

హైదరాబాద్ క్రెడాయ్ ప్రెసిడెంట్ వి.రాజశేఖర్‌రెడ్డి



జేఎన్టీయూహెచ్‌లో ఇంజినీరింగ్ డే వేడుకల్లో క్రెడాయ్ ప్రెసిడెంట్ వి.రాజశేఖర్‌రెడ్డి, రెక్టార్ విజయ్ కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్ రావు, ప్రిన్సిపాల్ జీవీ నర్సింహారెడ్డి తదితరులు

కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 21: మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజినీర్‌గా దేశానికి అందించిన సేవలు అమోఘమని క్రెడాయ్ ప్రెసిడెంట్ వి.రాజశేఖర్‌రెడ్డి అన్నారు. వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంజినీరింగ్ డే వేడుకలకు ముఖ్య అతిథులుగా హైదరాబాద్ క్రెడాయ్ ప్రెసిడెంట్ వి.రాజశేఖర్‌రెడ్డి, రెక్టార్ విజయ్ కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్ రావు, కళాశాల ప్రిన్సిపాల్ జీవీ నర్సింహారెడ్డి, మెటీ ఇంజినీరింగ్ కన్సల్టెన్సీ డైరెక్టర్ సీఏ ప్రసాద్, సివిల్ ఇంజినీర్ విభాగాధిపతి బి.డీన్ కుమార్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భారతదేశపు ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశాభ్యున్నతి కోసం ఎన్నో అద్భుతాలను సృష్టించారన్నారు. ఆ మహనీయుడిని స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

చిన్నారులు తాము ఉన్నత స్థానాలకు ఎదగడమే ఏకైక లక్ష్యమన్న భావనతో బుద్ధిగా చదువుకుంటే వారికి మంచి భవిష్యత్ ఉంటుందని సినీ నటుడు కార్తికేయ గుమ్మకొండ అన్నారు. శనివారం కార్తికేయ పుట్టిన రోజు సందర్భంగా లింగోజిగూడ డివిజన్ పరిధిలోని శ్రీ కీర్తన అనాథ ఆశ్రమం వృద్ధులు, బాలుర, మానసిక వికలాంగులు, చిన్నారులతో కలిసి కేక్ కట్‌చేసి ఆయన పుట్టిన రోజు వేడుకలు నిరాడంబరంగా జరుపుకొని సందడి చేశారు. కార్యక్రమంలో నాగార్జున విద్యా సంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్ రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ జి.రజినీ విఠల్ రెడ్డి, డైరెక్టర్ లోహితరెడ్డి, కీర్తన ఫౌండేషన్ నిర్వాహకులు అనిల్, మీనాక్షి పాల్గొన్నారు.

- చంపాపేట, సెప్టెంబర్ 21

క్లీన్ ఎనర్జీ రూపకల్పనకు అడుగులు

- కార్బన్ ఎమిషన్‌తో శుద్ధ ఇంధన తయారీకి పరిశోధనలు
- ఐఐసీటీ వేదికగా దేశంలోనే తొలి పరిశోధన మేథోమథన సదస్సు



సిటీబ్యూరో, సెప్టెంబర్ 21(నమస్తే తెలంగాణ): పర్యావరణానికి ప్రాణ సంకటంగా మారుతున్న కర్బన ఉద్గారాలను శుద్ధ ఇంధన వనరులుగా తీర్చిదిద్దాలంటూ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ(ఐఐసీటీ) వేదికగా జరిగిన జాతీయ స్థాయి మేథోమథన సదస్సుతో తొలి అడుగు పడింది. దేశంలోనే తొలిసారిగా కాలుష్య కారకాలను సహజ సిద్ధమైన, పర్యావరణహితమైన ఇంధన వనరులుగా అభివృద్ధి చేసేందుకు ఉన్న అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ఇప్పటికే బీహెచ్ఈఎల్ వంటి సంస్థతో ఐఐసీటీ గాలిలో ఉండే కర్బన ఉద్గారాలతో స్వచ్ఛమైన ఇంధనాలను తయారు చేయడంపై కసరత్తు చేస్తోంది. దీని కోసం ఇరు సంస్థల మధ్య కీలక ఒప్పందం చేసుకుని కృషి చేయనున్నాయి. పెరుగుతున్న ఇంధన వనరుల వినియోగం నేపథ్యంలో, పర్యావరణానికి హాని చేయని ఇంధనాలకు ప్రాధాన్యత పెరుగుతుంది. ఈ నేపథ్యంలో ఆధునాతన సాంకేతికతను డెవలప్ చేయడంలో మూడ్రోజుల పాటు నిర్వహించిన మేథోమథన సదస్సు ఎంతోగానో తోడ్పడుతుందని ఐఐసీటీ వర్గాలు పేర్కొన్నాయి.

పీల్చే గాలి కలుషితమవుతున్న తరుణం..

పీల్చే గాలి కలుషితమైపోతున్న తరుణంలో వాతావరణంలోని కాలుష్య కారకాలను ఇంధన వనరులుగా మార్చుకోవాల్సిన పరిస్థితులు వస్తున్నాయి. స్వచ్ఛమైన ఆక్సిజన్ కంటే గాలిలో పరిమితికి మించి పోతున్న కర్బన ఉద్గారాల నిర్మూలన, నియంత్రణ, పునర్వినియోగం వంటివి అత్యంత కీలకంగా మారాయి. వీటిన్నింటిని దృష్టిలో పెట్టుకుని వాతావరణంలో టన్నుల కొద్దీ చేరుతున్న కర్బన ఉద్గారాలను పునర్వినియోగంలోకి తీసుకువచ్చేలా పరిశోధనలను విస్తృతం చేయడంలో ఐఐసీటీ కీలక పాత్రను పోషించింది. దేశంలోని కెమికల్ రంగ నిపుణులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి క్యాటలిస్ ఫర్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్ అండ్ సస్టెనబిలిటీ(సీఈఈఎస్-24) ద్వారా మూడ్రోజుల సదస్సును ఇటీవల నిర్వహించారు. దాదాపు దేశంలోని 28 ప్రధాన పరిశోధన, ప్రముఖ విద్యా సంస్థలు, ఇంధన సంస్థలతో కలిసి ప్రత్యేక చర్చా వేదికను ఏర్పాటు చేసింది.